నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | మంగళవారం 10 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



పార్కు స్థలాన్ని ఆక్రమించి మంచిర్యాలకు చెందిన ఓ కాంగ్రెస్ లీడర్ నిర్మించిన ప్రహరీ గోడ



జన్మభూమినగర్ వద్ద మెయిన్‌రోడ్ పక్కన కాలువపై నిర్మించిన వంతెనలు

# కాంగ్రెస్ కబ్జా కహానీ!



## మంచిర్యాలలో భూ స్వాహాలతో చెలరేగిపోతున్న 'హస్తం' పార్టీ లీడర్లు

- ప్రభుత్వ, ప్రైవేట్ భూములు మింగేస్తున్న నేతలు
- సామాన్యులు నిర్మాణాలు చేపడితే తక్షణమే చర్యలు
- అదే అధికార పార్టీ నాయకులైతే కన్నెత్తి చూడని యంత్రాంగం
- విమర్శలకు తావిస్తున్న జిల్లా ఉన్నతాధికారుల వ్యవహారం

*కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మంచిర్యాల జిల్లా ఆగమైపోతుందని.. కబ్జా రాజ్యం.. రౌడీ రాజ్యం వస్తుందంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసిన విమర్శలు అక్షర సత్యమవుతున్నది. కొందరు అధికార పార్టీ లీడర్లు ప్రభుత్వ భూమి, పట్టా భూమి అని తేడా లేకుండా స్వాహా చేస్తుండగా, యంత్రాంగం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. సామాన్యులు పర్మిషన్ లేకుండా ఓ చిన్న ఫ్లోర్ నిర్మించినా తక్షణమే కూల్చి వేసే అధికారులు, అదే హస్తం నేతలు ప్రభుత్వ పార్క్ భూమి కబ్జా చేసినా.. రాంచెరువు మత్తడి కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా.. ప్రైవేట్ భూములు మింగినా.. చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ సాగుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 18 నెలల్లో ఆ పార్టీ నేతలు అనేక భూములను చెరబట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం..*

*- మంచిర్యాల, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### దర్జాగా పార్కు స్థలం కబ్జా..

మంచిర్యాల పట్టణంలోని రెడ్డికాలనీని ఆనుకుని ఉన్న బైపాస్‌రోడులో కార్పొరేషన్‌కు చెందిన ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు కబ్జా చేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. సర్వే నంబర్ 194లో దాదాపు 400 చదరపు గజాల స్థలాన్ని 25 ఏళ్ల కిందట రెడ్డికాలనీ లే అవుట్ చేసినప్పుడు మున్సిపాలిటీకి పార్కు స్థలం కోసం కేటాయించారు. దీని చుట్టూ ఎలాంటి ప్రహరీ, కంచె లేక పోవడంతో దీనిపై కన్నేసిన ఓ కాంగ్రెస్ నాయకుడు కబ్జా చేశాడు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే కార్పొరేషన్ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా బీసీ సెల్‌లో కీలక పదవిలో ఉన్న సదరు నేత.. ఎవ్వరొచ్చినా తాను కబ్జా చేసిన స్థలాన్ని తిరిగి తీసుకోలేరంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అందరినీ సెట్ చేశానంటూ బహిరంగంగానే చెబుతున్నారు. సామాన్యులు పర్మిషన్ లేకుండా ఇంటిపై మేడలు కడితేనే కూల్చేసిన మంచిర్యాల కార్పొరేషన్ అధికారులు.. పార్కు స్థలం కబ్జా చేసి గోడ కడితే ఆ పక్కకే వెళ్లడం లేదు. వెంటనే గోడను కూల్చి ప్రభుత్వ పార్క్ స్థలాన్ని కాపాడకుండా.. సదరు లీడర్ కట్టిన గోడను కూల్చి పార్కు స్థలం చుట్టూ ప్రహరీని నిర్మిస్తామని చెబుతున్నాడు. ఇదెక్కడి చోద్యం అన్నది అర్థం కాకుండా పోయింది. అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

### రాంచెరువు మత్తడి కాలువపై స్లాబ్‌లు

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో కొందరు అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాంచెరువు మత్తడి కాలువపై తమకు నచ్చినట్లు వంతెనలు నిర్మించుకుంటున్నారు. పక్కన మెయిన్ రోడ్డు ఉండడంతో మత్తడి కాలువపైనే స్లాబులు, ఇనుప వంతెనలు నిర్మించుకుంటున్నారు. ఈ తరహాలో మాజీ కౌన్సిలర్ కార్కూరి చంద్రమౌళి కాలువపై నిర్మించిన వంతెనను కూల్చివేసిన కార్పొరేషన్ అధికారులు.. మిగిలిన చోట్ల నిర్మించిన అక్రమ వంతెనలను పట్టించుకోలేదు. కారణమేమిటంటే.. ఆ వంతెనలు నిర్మించింది అధికార పార్టీ నాయకుడు మరి. రాంచెరువు మత్తడి కాలువపై నిర్మించిన వంతెనలను అన్నింటినీ తొలగిస్తామని అధికారులు చెబుతున్నా ఒక వంతెనను కూల్చి, అధికార పార్టీ నాయకులు కట్టుకున్న మిగిలిన వంతెనల వైపు కన్నెత్తి చూడకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### కోర్టును ధిక్కరించి.. మహిళ రైతుకు వేధింపులు

బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులోని సర్వే నం. 307లో చందన గిరి శంకరమ్మ అనే మహిళ రైతుకు 9.27 ఎకరాల భూమి ఉంది. స్థానిక కాంగ్రెస్ నాయకుడు కారుకూరి రాంచందర్ అండతో అతని కుటుంబీకులు, అనుచరులు తన భూమిని కబ్జా చేసి, దాడులు చేస్తున్నారని.. చంపేందుకు ప్రయత్నిస్తున్నారం టూ బాధిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే గడ్డం వినోద్.. రాంచందర్ నుంచి తనను రక్షించాలంటూ వేడుకున్నారు. ఈ మేరకు మొన్న బుధవారం ఆమె విడుదల చేసిన వీడియాలో సోషల్ మీడియాలో వైరల్‌గా మా రింది. 14 ఏళ్ల కిత్రం ఇదే కాంగ్రెస్ నేత కారుకూరి రాంచందర్ ప్రోద్బలంతో ఆయన కు టుంబీకులు చెట్టుకు కట్టేసి దాడి చేసి, ఉల్టా తనపైనే కేసు పెట్టారంటూ ఆమె ఆవేదన వ్య క్తం చేశారు. దీనిపై కోర్టుకు వెళ్తే ఇటీవల కోర్టు సైతం అనుకూలంగా పొజిషన్‌పై ఆర్డర్ ఇస్తూ ఆదేశాలు ఇచ్చిందంటున్నారు. కోర్టు తీర్పును ధిక్కరించి భూమి మీదకు వెళ్తే దాడులు చేస్తున్నారంటూ ఆమె వాపోయారు. పట్టా కాగితాలు, కోర్టు ఆర్డర్ కాపీ ఉన్నా కూడా బెదిరింపులు, దాడులు చేస్తున్నారని, దాడి విషయంలో ఫిర్యాదులు చేస్తే తాళ్ల గురిజాల పోలీసు లు పట్టించుకోవడం లేదని, సదరు కాంగ్రెస్ నాయకుడికే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కారుకూరి రాంచందర్, అతని కుటుంబీకులు, అనుచరుల నుంచి తనను రక్షించి న్యాయంగా తన భూమిని తిరిగి ఇప్పించాలంటూ ఆమె వేడుకున్నారు.



తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత మహిళ రైతు శంకరమ్మ



గర్మిళ్ల శివారు 315 సర్వే నంబర్‌లో అధికార పార్టీ నాయకులు కబ్జా చేసిన భూమి

### గర్మిళ్లలో ప్రైవేటు భూమిపై ఎమ్మెల్యే అనుచరుల కన్ను

గర్మిళ్ల శివారులోని సర్వే నం. 315లోని ఓ పట్టా భూమిపై స్థానిక ఎమ్మెల్యే అనుచరుల కన్ను పడింది. ఎమ్మెల్యే బంధువులమని చెప్పుకుంటూ పట్టాదారుడిని భయభ్రాంతులకు గురి చేస్తూ దౌర్జన్యంగా భూమిలోకి చొరబడ్డారు. గేటు తాళాలను పగలగొట్టి భూమి మొత్తాన్ని చదును చేశారు. ఈ విషయంపై బాధితుడి పోలీసులను ఆశ్రయించి ఎనిమిది నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తహసీల్దార్ సైతం ఆ భూమి పట్టాదారుకు చెందినదే అని డిక్లరేషన్ ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది. పైగా పట్టాదారు కేసు పెట్టిన మరుసటి రోజు ఆక్రమణదారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాదారుపైనే పోలీసులు తిరిదగి కేసు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తున్నది. కేసు పెట్టి ఎనిమిది నెలలు గడిచిపోతున్నా కాలయాపన చేస్తూ ఆక్రమణదారులకే అధికారులు సహకరిస్తున్నారంటూ బాధి తుడు వాపోతున్నాడు. 20 ఏండ్ల క్రితం భూమి కొనుగోలు చేసి ఇంటి పన్ను, నల్లా పన్ను, వెకెట్ ల్యాండ్ ట్యాక్స్, కరెంట్ బిల్లులు కడుతూ వస్తున్నా నని పట్టాదారు పూదరి మల్లాగౌడ్ చెబుతున్నారు. గర్మిళ్ల శివారులోని సర్వే నం.315లో రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే సేత్వార్ ప్రకారం 315/అ సర్వే నంబర్‌లో ఆకుల నారాయణ పట్టేదారుగా ఉన్నారు. 1954 కాస్రా పహణీ ప్రకారం ఈ సర్వే నంబర్‌లో ఆకుల నారాయణ కు రెండు ఎకరాల 34 గుంటలు ఉంది. ఇందులో ఎకరంపావు 6,665 గజాల భూమిని ఆకుల నారాయణ వారసులు 2007లో పూదరి కళావ తి (ప్రస్తుత పట్టాదారు పూదిరి మల్లాగౌడ్)కు భార్యకు విక్రయించారు. ఇంత క్లీయర్ టైటిల్.. రెవెన్యూ రికార్డుల్లోనూ ఇదే ఉంది. కానీ పట్టాదా రును ఇబ్బంది గురి చేస్తున్న ఆక్రమణదారులపై ఇప్పటి దాకా ఎలాంటి చర్యలు లేవు. పోలీసులు, మున్సిపాల్ అధికారుల చుట్టూ కాళ్లు అరిగే లా తిరిగినా ఫలితం లేకుండా పోయిందని బాధితుడు అంటు న్నారు. ఈ వ్యవహారం పలు వార్త కథనాలు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### భూమి మాదంటూ దౌర్జన్యంగా పెన్సింగ్..


గర్మిళ్ల శివారులోని సర్వే నంబర్ 290లో అధికార పార్టీకి చెందిన ఓ లీడర్ దౌర్జన్యంగా పెన్సింగ్ వేశారు. ఈ సర్వే నంబర్‌లో దాదాపు 19.28 ఎకరాల భూమి ఉంది. ఇందులో 9 ఎకరాలు 2004లో ప్లాటింగ్ చేసిన విక్రయించారు. గడిచిన 20 ఏండ్లలో ఆ ప్లాట్‌లు ఎందరో చేతులు మారుతూ వచ్చాయి. కొన్ని నెలల క్రితం అధికార పార్టీకి చెందిన రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఇందులో ఎకరం 25 గుంటలు కొనుగోలు చేశానంటూ 21 ప్లాట్‌ల చుట్టూ దౌర్జన్యంగా పెన్సింగ్ వేశారు. 20 ఏండ్లుగా ఏనాడూ రాని వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి అండతో వచ్చి భూమి తనదంటూ దౌర్జన్యంగా పెన్సింగ్ వేశారని వాపోతున్నారు. కొన్ని నెలలుగా పోలీసులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదంటున్నారు. ప్లాట్‌లను ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్న మాజీ కార్పొరేటర్‌పై ఫిర్యాదు చేయడానికి వెళ్తే, తన మీద కాదు మీకు ప్లాట్‌లు అమ్మిన యాజమానుల మీద ఫిర్యాదు ఇవ్వండంటూ పోలీసు అధికారులు ఒత్తిడి తెస్తున్నారని బాధితులు వాపోతున్నారు. అధికార పార్టీ లీడర్లు కావడంతో అంతా వెళ్లి మంచిర్యాల ఎమ్మెల్యేను సైతం కలిశామంటున్నారు. అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో ఏం చేయాలో తెలియక ఇప్పటికే పలుసార్లు బాధితులు ధర్నాలకు దిగారు. ఇంత జరుగుతున్నా పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోకపోవడం కొసమెరుపు.



గర్మిళ్ల శివారు సర్వే నంబర్ 290లో వేసిన పెన్సింగ్‌ను తొలగించాలంటూ ధర్నా చేస్తున్న బాధితులు (ఫైల్)

# అవినీతిపై విచారణ చేపట్టాలి

- మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పోస్టులను ఇష్టానుసారంగా భర్తీ చేశారు
- ప్రజా సంఘాల ఆరోపణ - అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఆసిఫాబాద్‌లో నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి రాస్తారోకో



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు


కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామక ప్రక్రియలో అవినీతి, అవకతవకలు జరిగాయని, దీనిపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని నిరుద్యోగ అభ్యర్థులతోపాటు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 52 పోస్టులను మెరిట్ లిస్ట్ ఆధారంగా కాకుండా ఇష్టానుసారంగా భర్తీ చేశారంటూ ఆందోళనకు దిగారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, అభ్యర్థులు రాస్తారోకో చేశారు. మెడికల్ కళాశాలల్లో అవసరమైన ల్యాబ్ అసిస్టెంట్, డాటాఎంట్రీ ఆపరేటర్, రేడియోగ్రఫీ టెక్నీషియన్, సీటీ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, అనస్తిషియా టెక్నీషియన్, ధోబి, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, డ్రైవర్, థియేటర్ అసిస్టెంట్, గ్యాస్ ఆపరేటర్, వార్డు బాయ్స్ వంటి 52 పోస్టులను ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు మెరిట్ జాబితాను రూపొందించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల కోసం 552 మంది, ల్యాబ్ అటెండర్ల కోసం 223 మంది, ఎలక్ట్రీషియన్ కోసం 100 మంది, వార్డు బాయ్స్ కోసం 69 మంది, అనస్తిషియ టెక్నీషియన్ కోసం 48 మంది, థియేటర్ అసిస్టెంట్‌కు 43 మంది, రేడియోగ్రఫీ టెక్నీషియన్‌కు 27 మంది, సిటీ స్కాన్‌కు 24, డ్రైవర్‌కు 14, ఈసీజీ టెక్నీషియన్‌కు 13, గ్యాస్ ఆపరేటర్‌కు 13 మంది చొప్పున మెరిట్ లిస్ట్‌లో ఉన్నారు. మెరిట్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలకు పిలువడం, మెరిట్‌లో మొదటి స్థానంలో ఉన్న వారికి కనీసం సమాచారం లేకుండా ఇంటర్వ్యూలు నిర్వహించడం అవినీతి ఆరోపణలకు తావిస్తున్నది. ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేసే పోస్టులకు ఈ నెల 3న ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెరిట్‌లిస్ట్‌లోని అభ్యర్థులతో కొంత మంది బేరసారాలు చేశారని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మెరిట్ ఆధారంగా కాకుండా డబ్బులు ఇచ్చిన వారినే ఇంటర్వ్యూలకు పిలిచి పోస్టింగ్‌లు ఇచ్చారని, మెరిట్ లిస్ట్‌లో మొదటి స్థానాల్లో ఉన్న వారిని కాకుండా ఇష్టానుసారంగా ఇంటర్వ్యూలు నిర్వహించారని అభ్యర్థులతో పాటు వివిధ ప్రజాసంఘాలు ఆరోపించారు. ల్యాబ్ టెక్నీషియన్ మొదలుకొని వార్డు మెంబర్ల వరకు అన్ని పోస్టుల్లోనూ రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు డిమాండ్ చేశారని ఆరోపిస్తున్నారు. అధికారులు ఇష్టానుసారంగా నిర్వహించిన ఇంటర్వ్యూలపై విచారణ జరిపించి అర్హులకు పోస్టులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతి పత్రం అందించారు.బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఇన్‌చార్జి తుకారాం, భీం యువసేన సభ్యులు వినోద్, దుర్గం శ్యాంరావ్, జాడే కృష్ణాజీ, చంద్ర పెంటయ్య, సుధాకర్, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

# అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎమ్మెల్యే

- బీఆర్‌ఎస్ హయాంలోని అభివృద్ధి పనులు రద్దు చేయడం సరికాదు
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



నస్పూర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్, జూన్ 9: నస్పూర్‌లో అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందని, తన హయాంలో తీసుకువచ్చిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రద్దు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన నస్పూర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పట్టణంలోని వినూత్న కాలనీ గల బ్రిడ్జిని ఆయన పరిశీలించారు. అనంతరం సుందరయ్యకాలనీలో సమీపంలోని నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తాను రూ.80లక్షల నిధులు మంజూరు చేయించి వినూత్నకాలనీలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, తర్వాత వచ్చిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన ప్రేంసాగర్‌రావు నిధులు రద్దు చేయించడం సరికాదన్నారు. వెంటనే బ్రిడ్జి పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. పటణ ప్రజలకు అన్ని రకాల నిత్యావసర సరుకులు ఒకే చోట అందించడానికి సీసీసీ సుందరయ్యకాలనీ పాత కూరగాయల మార్కెట్ స్థలంలో దాదాపు రూ.7కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు చేపట్టామని, ఈ పనులు దాదాపు పూర్తయినప్పటికీ ప్రభుత్వం మారిన తర్వాత మిగిలి ఉన్న పనులు పూర్తి చేయకుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే పనులు పూర్తి చేసి మార్కెట్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లక్షెట్టిపేటలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మొత్తం పూర్తయినా ప్రారంభించడం లేదన్నారు. ఎన్నికలకు ముందు నస్పూర్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తే..ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రేంసాగర్‌రావు తనపై కక్షతో పనులన్నీ రద్దు చేయించారని ఆరోపించారు. సీతారాంపల్లి చౌరస్తా నుంచి రోడ్డు విస్తరణకు రూ.కోటి, లైబ్రరీ నిర్మాణానికి రూ.50లక్షలు, విలేజ్‌నస్పూర్ నుంచి గోదావరి నది వరకు రోడ్డు నిర్మాణానికి రూ.78లక్షలు, అంబేద్కర్ భవన నిర్మాణం కోసం రూ.45లక్షలు, బతుకమ్మ ఘాట్ కోసం రూ.కోటి, సీసీసీ కార్నర్ నుంచి టౌన్‌షిప్ వరకు చేపట్టే రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు, నస్పూర్ కలెక్టరేట్ సమీపంలో నూతన మున్సిపల్ ఆఫీస్ నిర్మాణానికి రూ.3కోట్లు, ఇవే కాకుండా నస్పూర్ పట్టణంలో దాదాపు 300పైగా రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకువస్తే వాటిని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రేంసాగర్‌రావు రద్దు చేశారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం తాను అభివృద్ధి పనుల కోసం తీసుకువచ్చిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రిటైర్డ్ కార్మికులకు 2గుంటల ఇంటి స్థలం ఇస్తామని ప్రేంసాగర్‌రావు హామీ ఇచ్చి నెరవేర్చలేకపోతున్నారని, జాతీయ రహదారి బాధితులు 206మందికి తన హయాంలో 80 గజాల భూమిని కేటాయించానని, అప్పుడు ప్రేంసాగర్‌రావు వీరికి రూ.10 లక్షలతో పాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ప్రేంసాగర్‌రావు వీరికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తాను నస్పూర్ పట్టణ అభివృద్ధికి కృషి చేశానని, నిధులన్నీ రద్దు చేయించి తాను అభివృద్ధి చేయలేదంటూ ప్రజల్లో ఎమ్మెల్యే అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కక్షసాధింపు రాజకీయాలు మానుకుని ప్రజలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని దివాకర్‌రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మేరుగు పవన్, టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, నాయకులు వంగ తిరుపతి, హైమద్, గర్శె రామస్వామి, ఆకునూరి సంపత్, జాబ్రిగొస్, కుర్మిళ్ల మోహన్, బండారి తిరుపతి, కాటం రాజు, మేడం తిరుపతి, అడ్లకొండ రవిగౌడ్, గర్శె భీమయ్య, తిరుమల్ రావు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథ్‌పూర్ ప్రాజెక్ట్ కాల్వల పరిశీలన

దహెగాం, జూన్ 9: కాగజ్‌నగర్ మండలంలో పెద్దవాగుపై నిర్మిస్తున్న జగన్నాథపూర్ ప్రాజెక్ట్ కాలువలను కేంద్ర బృందం అధికారులు సోమవారం పరిశీలించారు. దహెగాం మండలంలోని దహెగాం, కోత్మీర్, ఇట్యాల శివారులో ప్రాజెక్ట్ అసంపూర్తిగా ఉన్న ప్రధాన కాల్వలను కేంద్ర పెట్రోలియం సహజ వనరుల గ్యాస్ జాయింట్ సెక్రటరీ వినోద్ శేషన్, శాస్త్రవేత్త రేమా ఎస్ పిల్లై కేంద్ర బృందం పరిశీలించారు. తెలంగాణలోని అసంపూర్తి ప్రాజెక్టులను పరిశీలించి నివేదికలు అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పరిశీలించినట్లు బృందం అధికారులు తెలిపింది. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, కేంద్ర భూగర్భ, జలవనరుల ఈఈ వెంకటేశ్వర్లు, మంచిర్యాల సర్కిల్ సీఈ సత్యరాజ్ చంద్ర, ఎస్ఈ కుమారస్వామి, ఈఈ ప్రభాకర్, తహసీల్దార్ మునవర్ షరీఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జగన్నాథపూర్ ప్రాజెక్ట్ ప్రధాన కాలువను పరిశీలిస్తున్న కేంద్ర బృందం